

ఘనంగా వైఎస్ జార్జిరెడ్డి వర్ధంతి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరుడు దివంగత వైఎస్ జార్జిరెడ్డి వర్ధంతిని పులివెందుల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. -8లో



హిందూ ముస్లింలు సోదరభావంతో మెలగాలి

రాయచోటిలో హిందూ ముస్లింలు సోదరభావంతో మెలిగాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.440
రెండోరకం	రూ.250	రూ.340



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 98 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	485	520
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 186.300 కిలోలు

న్యూస్‌రీల్

రాయచోటి, తంబళ్లపల్లిలో ఉద్యోగమేళా

రాయచోటి (జగదాంబసెంటర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పీడప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని రాయచోటి, తంబళ్లపల్లిలలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీన రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, 13వ తేదీన తంబళ్లపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉద్యోగమేళా జరుగుతుందన్నారు. అల్‌డిక్సన్, టాటా కాపిటల్, నవ భరత్ ఫెర్టిలైజర్, అమరరాజా గ్రూప్స్, ఏయు స్మాల్ ఫినాన్స్ బ్యాంకు తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు.ఇతర వివరాలకు రాయచోటికి సంబంధించి 9550104260, తంబళ్లపల్లికి సంబంధించి 9618655759 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు వైఎస్ఆర్ జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రి రాక

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సోమవారం జిల్లాకు వస్తున్నట్లు వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లె, మధ్యాహ్నం కమలాపురం మండలం చిన్నచెప్పలిలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో ఆమె పాల్గొంటారని తెలిపారు. ఆయా మండలాల గ్రామ ప్రజలు రెవెన్యూ సదస్సులకు హాజరై తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని కోరారు.

శిల్పారామం పరిశీలన



శిల్పారామాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర శిల్పారామాల చైర్మన్ చెరెడ్డి మంజులారెడ్డి

కడప కల్చరల్: ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర శిల్పారామాల చైర్మన్ చెరెడ్డి మంజులారెడ్డి శనివారం కడప శిల్పారామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శిల్పారామం ఏఓ పి.శివప్రసాద్‌రెడ్డి, ఇతర సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. శిల్పారామంలోని అన్ని విభాగాల గురించి వివరించారు. చైర్మన్ ప్రత్యేకంగా శిల్పారామంలోని బోటింగ్ పరిస్థితులను పరిశీలించారు. బోటింగ్ ఐల్యాండ్‌ను వినియోగంలోకి తేవడంతో పాటు మిగతా అంశాలన్నీ ముందుకంటే మెరుగ్గా, ఆకర్షణీయంగా ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. విలేజ్ మ్యూజియం అభివృద్ధి గురించి మాట్లాడుతూ అవసరమైనచోట లైటింగ్‌ను పెంచాలన్నారు. అనంతరం గేమ్స్ జోన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె శిల్పారామం ప్రాంగణంలో మొక్క నాటారు. శిల్పారామం అభివృద్ధిలో భాగంగా రీసార్ట్‌ను ఏర్పాటు చేయదలుచుకున్నామని, శిల్పారామంలోగానీ, పక్కన గల శిల్పారామం స్థలంలోగానీ ఏర్పాటు చేసుకునేందుకు ఎవరైనా ముందుకు వస్తే పీపీపీ పద్ధతిలో వారు నిర్వహించేందుకు తక్కువ ధరకే ఇస్తామన్నారు.

టెండర్లా.. నామినేషన్లా!

- పీబీసీ విస్తరణ పనుల ఒప్పందం రద్దు చేయనేలేదు
- రూ.473 కోట్ల లైనింగ్ పనిని నామినేషన్‌పై అప్పగింతకు అత్యుత
- టెండర్ల ద్వారా పని చేపట్టేందుకు కాంట్రాక్టు సంస్థ ఆసక్తి

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లాలో సాగే హంద్రీ-నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ(పీబీసీ) లైనింగ్ పనుల కాంట్రాక్టును ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో అప్పగిస్తుందా లేక టెండర్ల ద్వారా పనులు చేయిస్తుందా అన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఈ పనుల వ్యవహారం ఇంకా కొలిక్కి రాకపోవడం, అధికారుల ఒత్తిళ్లు ఉన్నప్పటికీ ఆశించిన మేర కాంట్రాక్టు సంస్థ పనులు మొదలు పెట్టకపోవడంతో ప్రశ్నార్థకమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2022లో పీబీసీని విస్తరింపజేసే పనులకు టెండర్లు నిర్వహించగా రివర్స్ టెండరింగ్‌లో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ పని దక్కించుకోగా ప్రభుత్వంతో ఒప్పంద ప్రక్రియ పూర్తయింది. కూటమి ప్రభుత్వం రాకతో ఇప్పటిదాకా జరిగిన పనితో సరిపెట్టి ముందుకు వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేయడంతో కాంట్రాక్టు సంస్థ పనులను నిలిపివేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా పీబీసీ విస్తరణ పని కాంట్రాక్టు సంస్థకే లైనింగ్ కాంట్రాక్టును అప్పగించేందుకు సిద్ధమైంది. ఇందులో కొందరు అధికారులు కీలకంగా వ్యవహరించి నామినేషన్ పద్ధతిలో పని ఇచ్చేద్దామని ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నం సాగుతుండగా, ప్రభుత్వ స్థాయిలోని ఓ అధికారి దీన్ని వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. దీంతో పీబీసీ లైనింగ్ పనులకు టెండర్లు నిర్వహిస్తారా నామినేషన్‌పై అప్పగిస్తారా అన్నది చర్చనీయాంశమైంది.

ఎవరి ప్రయోజనాలు వారివి

టెండర్లు నిర్వహిస్తే కాంట్రాక్టు సంస్థకు ప్రయోజనం దక్కుతుంది. నామినేషన్ పద్ధతిలో పనిచేస్తే కాంట్రాక్టు సంస్థ అధికారులు చెప్పినట్టు నడుచుకోవాలి. దీంతో కాంట్రాక్టు సంస్థ స్వేచ్ఛగా పనులు చేసుకోవాలనే చూస్తుంది. టెండర్లతో పనులు దక్కించుకుంటే అధికారులతో పెద్దగా అవసరం ఉండదు. ప్రభుత్వ స్థాయిలో బిల్లులు, పనులు జరుగుతాయి. కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారం పనులు చేసేందుకు టెండర్లు నిర్వహిస్తారు. దానితోనూ లాభమే. నామినేషన్‌తో పనిచేస్తే 2022 నాటి ధర ప్రకారం చేయాల్సి వస్తుంది. ఇది నష్టం తెస్తుంది. కాబట్టి ప్రభుత్వం లైనింగ్ పనులకు టెండర్లు నిర్వహిస్తే అన్నివిధాలా శ్రేయేస్కరమని కాంట్రాక్టు సంస్థ భావిస్తున్నట్టు చెబుతున్నారు. నామినేషన్‌పై పని చేస్తే కిందిస్థాయి నుంచి అధికారులు చెప్పినట్టే నడుచుకోవాలి.. లేదంటే మొదటికే మోసం వస్తుంది. దీనివల్లే కాంట్రాక్టు సంస్థ నామినేషన్‌పై పని చేసేందుకు సుముఖంగా లేదని అంటున్నారు. అయితే ఓ ఉన్నతాధికారి మాత్రం నామినేషన్‌పై పని అప్పగించేద్దామని ప్రతిపాదిస్తుండగా, ప్రభుత్వస్థాయి అధికారి దీన్ని వ్యతిరేకిస్తూ పారదర్శకంగా వ్యవహరించాలని పరోక్షంగా టెండర్ల నిర్వహణకు సూచిస్తున్నట్లు తెలిసింది.



లైనింగ్ పనులు చేపట్టాల్సిన పుంగనూరు ఉపకాలువ

కుప్పానికైతే టెండర్లు

కుప్పం ఉపకాలువ లైనింగ్ పనులకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం పాలనాపరమైన అనుమతితో మంగళవారం జీవో జారీ చేసింది. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో ఉపకాలువ 0.000 కిలోమీటర్ నుంచి 66.950 కిలోమీటర్ వరకు లైనింగ్ పనికి రూ.99.20 కోట్లు, కుప్పం నియోజకవర్గంలో 66.900 కిలోమీటర్ నుంచి 131.200 కిలోమీటర్ వరకు లైనింగ్ పనికి రూ.97.71 కోట్లు మంజూరు చేసింది. ఈ జీవోలోనే లైనింగ్ పనులకు టెండర్ల నిర్వహణ ఉంటుందని, దీనికి సంబంధించి సాంకేతిక అను మతి తిరుపతి సీఈ ఇస్తారంటూ పేర్కొన్నారు. అంటే కుప్పం లైనింగ్ పనులకు టెండర్లు నిర్వహిస్తున్న ప్రభుత్వం పీబీసీ లైనింగ్ పనులపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

ఒప్పందం రద్దు కాకనే సాధ్యమా



పీబీసీ విస్తరణ పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2020లో నిధులు మంజూరు చేయగా 2022 సెప్టెంబర్‌లో జరిగిన టెండర్లలో నాగార్జున కన్స్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.1,217 కోట్లతో కాంట్రాక్టు దక్కించుకుంది. జిల్లాలోని పెద్దతిప్పసముద్రం మండలం సీవీరామన్నగారిపల్లె వద్ద కిలోమీటర్ 79.600 నుంచి చిత్తూరుజిల్లా పెద్దపంజాణి మండలంలో కిలోమీటర్ 220.350 వరకు విస్తరణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 25శాతంలోపు జరిగిన పనులను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే పీబీసీ విస్తరణ పని కాలువ కాకుండా 10 శాతంలోపే జరిగింది. ఈ పని నిలిపివేసిన ప్రభుత్వం రూ. 473 కోట్ల వ్యయంతో ఇదేకాలువకు లైనింగ్ పనులు చేయించాలని నిర్ణయించింది. ఈ పనులను పీబీసీ విస్తరణ కాంట్రాక్టు సంస్థకే కట్టబెట్టేందుకు అధికారులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇలా అప్పగించాలనే ప్రయత్నాలకు ముందు పీబీసీ విస్తరణ పని ఒప్పందాన్ని రద్దు చేసుకొంటూ ఇప్పటి చర్యలు చేపట్టలేదని తెలుస్తోంది. అయితే పాత ఒప్పందం రద్దు చేయకనే నామినేషన్ ప్రాతిపదికన ఎలా కట్టబెడతారన్నది ఉత్పన్నమవుతున్న ప్రశ్న. ఒప్పందం రద్దయ్యాక ఇదే సంస్థకు నామినేషన్‌పై అప్పగించే అవకాశం ఉంటుంది. అయితే కాంట్రాక్టు సంస్థ కాలువపై జంగిల్ క్లియరెన్స్ పనులను నత్త కంటే మెల్లగా అక్కడక్కడా చేయిస్తోంది.

పార్లమెంట్‌లో మహిళలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి

సామాజిక వేత్త ఆచార్య కల్పనా కన్నబిరాన్



వెబినార్‌లో మాట్లాడుతున్న కల్పనా కన్నబిరాన్


వైవీయూ: పార్లమెంటులో మహిళలకు సమాన ప్రాధాన్యత కల్పించడం ద్వారా లింగ సమానత్వం సాధ్యమవుతుందని ముఖ్య వక్త ప్రముఖ సామాజిక వేత్త న్యూఢిల్లీ కౌన్సిల్ పర్ సోషల్ డెవలప్‌మెంట్, న్యాయ విద్వాంసులు ఆచార్య కల్పనా కన్నబిరాన్ పేర్కొన్నారు. శనివారం వైవీయూలో 'జెండర్ జస్టిస్ అండ్ కానిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియా' పేరుతో వెబినార్ నిర్వహించారు. వెబినార్‌లో ఆచార్య కల్పనా కన్నబిరాన్ కీలకోపన్యాసం చేస్తూ ఆర్టికల్ 14, 15, 106వ సవరణ చట్టం వంటి వివిధ ఆర్టికల్స్ ద్వారా లింగ న్యాయాన్ని ప్రోత్సహించడానికి రాజ్యాంగం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను అందించి సమానత్వం అనే ఆలోచనను ప్రతిబింబిస్తుందన్నారు. వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి ప్రారంభోపన్యాసం చేస్తూ సమాన అవకాశాలు కల్పించడం ద్వారా స్త్రీ పురుషుల మధ్య అసమానతలు తొలగించవచ్చన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ రాజ్యాంగం అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఆర్థికంగా సామాజిక ఎదుగుదలకు సంస్కరణలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థికంగా ఎదిగినప్పుడే సమానత్వం సాధ్యమన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఉన్నత విద్యను అభ్యసించే మహిళల సంఖ్య పెంచడం ద్వారా లింగ సమానత్వం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. వెబినార్ కన్వీనర్ ఆచార్య ఎం. అనిత అధ్యక్షత వహించి మాట్లాడుతూ వెబినార్ ఉద్దేశాన్ని వివరించారు. వెబినార్లో పాల్గొన్న వారికి ఈ-సర్టిఫికెట్ అందజేశారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు బి. రమేష్ ,పి.వి. వరప్రభాకర్, ఎన్జీవో ప్రతినిధి బి. మదన్ మోహన్ రెడ్డి, న్యాయవాది ఆర్. జయభారతి, సరళ, సుమలత తదితరులు పాల్గొన్నారు.



వెబినార్‌లో పాల్గొన్న వైవీయూ వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ తదితరులు

12 నుంచి అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో పౌర్ణమి రోజు, మహాదీప దర్శనం కోసం వెళ్లే వారి కోసం ఈనెల 12 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు.



- కడప డిపో బస్సులు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా నడుస్తాయని, బద్వేలు డిపో బస్సులు పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా నడుస్తాయన్నారు. మైదుకూరు డిపో బస్సులు పోరుమామిళ్ల, కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, మరో బస్సు మైదుకూరు, కడప, చిత్తూరు మీదుగా నడుస్తాయన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

12వ తేదీన అఖండ దీప దర్శనానికి ..

డిపో	వెళ్లు సమయం	చార్జి
కడప	రాత్రి 9 గం॥	రూ.1072
బద్వేలు	రాత్రి 8 గం॥	రూ.1668
మైదుకూరు	ఉ॥ 7 గం॥	రూ.1414
మైదుకూరు	సా॥ 6 గం॥	రూ.1209
జమ్మలమడుగు	రాత్రి 8 గం॥	రూ.1568
13వ తేదీన..		
ప్రొద్దుటూరు	ఉ॥ 6 గం॥	రూ.1273
పులివెందుల	ఉ॥ 7 గం॥	రూ.1193
14వ తేదీన గిరి ప్రదక్షిణకు..		
కడప	రా॥ 9 గం॥	రూ. 1072
బద్వేలు	ఉ॥ 7 గం॥	రూ. 1668
బద్వేలు	మ॥ 2 గం॥	రూ. 1163
మైదుకూరు	ఉ॥ 7 గం॥	రూ.1414
మైదుకూరు	సా॥ 6 గం॥	రూ.1209
ప్రొద్దుటూరు	మ॥ 1 గం॥	రూ.1273
పులివెందుల	ఉ॥ 7 గం॥	రూ. 1193
జమ్మలమడుగు	సా॥ 5 గం॥	రూ.1363

ప్రజలు సంతోషంగా ఉండాలి

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

ఓబులవారిపల్లె: రాష్ట్రప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు బాగా కురవాలని, ప్రజలందరూ బాగుండాలని 22వ తిరుమల మహాపాదయాత్ర చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. ఆకేపాటి పాదయాత్ర శనివారం ఓబులవారిపలెమండలానికి చేరుకుంది. ఉదయం రెడ్డిపల్లె చెరుకట్ట సమీపంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోవింద మాల ధరించి భక్తులతో అన్నమయ్య నడయాడిన కాలిబాటలో ప్రతి ఏడాది మహా పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. అన్నమయ్య కాలిబాటను అభివృద్ధి చేయాలని చాలా సంవత్సరాలుగా కృషి చేస్తున్నానని. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి సర్వే నిర్వహించి అభివృద్ధి దిశగా అడుగులు వేశారన్నారు. కడప డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి మాట్లాడుతూ రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి గారి స్ఫూర్తితో కడప నుండి తిరుమల పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ ప్రముఖ నాయకులు మహా పాదయాత్రలో పాల్గొని ఆకేపాటికి సంఘీభావం తెలిపారు. చిన్నఓరంపాడు అడ్డరోడ్డులో కడప మేయర్ సురేష్‌బాబు,మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ముక్కావారిపల్లె జిల్లా ఉన్నతపాఠశాలతో వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి,మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ మాసీమబాబు,యానదయ్య, మాజీ చైర్మన్ పులి సునీల్‌కుమార్,రాయచోటి వీఆర్ పాఠశాలల అధినేత వేంకట రామిరెడ్డి కోర్లకుంట వద్ద మండల వైఎస్సార్‌పార్టీ అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, మంగంపేట వద్ద మాజీ డీఆర్ యూసీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి బిజేపీ నాయకులు జగదీశ్వర్ చికెన్‌సెంటర్ చెందిన నాగేశ్వరావు ఘనంగా స్వాగతం పలికారు.



ఆకేపాటి అమరనాథరెడ్డి పాదయాత్రలో పాల్గొన్న కడప మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ఆకేపాటిని కలిసిన వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

విలువలతో కూడిన విద్యను అందించాలి

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

సాక్షి ప్రతినిధి, కడప: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందజేయడం ఉపాధ్యాయుల బాధ్యత అని, బడి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన ప్రధాన బాధ్యత తల్లిదండ్రులదేనని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. శనివారం కడపలోని నగరపాలక ఉన్నత పాఠశాలలో (మెయిన్స్) నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాయలసీమ అంటేనే చదువుల నేల అని, ఇలాంటి ప్రాంతానికి రావడం తన అదృష్టమన్నారు. రాయలసీమకు జిల్లాలో పుస్తక నిధి అధికంగా ఉండడంతో ఇక్కడి ప్రజల్లో విజ్ఞాన సంపద అధికంగానే ఉంటుందనే భావన వ్యక్తం చేశారు. ఎందరో విద్యావేత్తలు, కవులు, సాహితీవేత్తలకు పుట్టినిల్లు కడప అని కొనియాడారు. రాయలసీమ అంటే అభివృద్ధికి వెనకబాటు కాదని, అవకాశాలను అందించే వనరుల నిధి అన్నారు. సమాజానికి సరైన చదువు ఇవ్వకపోతే అభివృద్ధికి కళ్లెం వేసినట్లేనన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక దేవాలయంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యాశాఖాధికారులపై ఉందన్నారు. విద్యార్థులు సమయానికి పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడడంతోపాటు ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలనన్నారు.

సొంత నిధులు వెచ్చిస్తాం....

కడప మున్సిపల్ కార్పొరేషన్ స్కూలు కిచెన్ అభివృద్ధి పనులకు నిధులను తన సొంత ట్రస్ట్ నుంచి అందిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ హైస్కూలులో ఎలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు జరిగినా అందుకు బహుమతులు, జ్ఞాపికలు తదితర ఖర్చును కూడా భరిస్తానన్నారు. ఆడ బిడ్డలకు అన్యాయం జరుగుతున్నా, అమాయకులను మోసం చేస్తున్నా నిర్భయంగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువస్తే న్యాయం చేస్తారన్నారు. దేశ భద్రత కోసం ప్రాణాలర్పించిన అమర వీరులను, ప్రతి రోజు మన పరిసరాలను శుభ్రపరిచే పారిశుధ్య కార్మికుల రుణం తీర్చుకోలేనిదన్నారు. పారిశుధ్య కార్మికులను గౌరవించాలన్నారు. ఉపాధ్యాయులకు కూడా ఆహారం అందించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

విద్యార్థులతో మాటామంతీ...

తొలుత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాఠశాల తరగతి గదులు, ఆవరణలో పలు నిర్మాణాలను, భవనాలను పరిశీలించారు. 6, 8, 10 తరగతుల విద్యార్థులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుత విద్యా విధానం, సిలబస్, పరీక్షల నిర్వహణ మొదలైన అంశాలపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మధ్యాహ్నం పిల్లలతో కలిసి సహపంక్తి భోజనాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఇన్‌ఛార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పాల్గొన్నారు.

అష్టకష్టాలు



మధ్యాహ్న భోజనానికి వేళ్లే విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

కడపలోని మున్సిపల్ హైస్కూలులో శనివారం మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్ నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సమాజంలో గురువులకు గొప్ప స్థానం ఉందని.. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ప్రసంగించారు. కాగా సమావేశం నేపథ్యంలో పాఠశాలకు తరలివచ్చిన తల్లిదండ్రులు, విద్యార్థులు అష్టకష్టాలు పడ్డారు. చాలా మంది తల్లిదండ్రులను, విద్యార్థులను పోలీసులు పాఠశాలలోనికి అనుమతించలేదు. దీంతో వారు ఎండలో బయటే నిలబడ్డారు. ఇక డిప్యూటీ సీఎం సభ ఆలస్యం కావడంతో భోజనానికి విద్యార్థులు ఇక్కట్లు పడ్డారు. పోలీసులు విద్యార్థులను తీవ్రంగా అడ్డుకున్నారు. ఇదేం పద్ధతి అంటూ జనం పోలీసుల తీరును తప్పుబట్టారు. - మహమ్మద్ రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప



తల్లిదండ్రులను ఆపుతున్న పోలీసులు

క్లుప్తంగా

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన కృష్ణమూర్తి

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణం అనపగుట్టకు చెందిన కృష్ణమూర్తి, స్థానిక మార్కెట్‌యార్డులో కూలీగా పనిచేస్తున్నాడు. శనివారం వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో అంగళ్లుకు వెళుతుండగా, మార్గ మధ్యంలోని సర్కారుతోపు వద్ద వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

25 లీటర్ల సారా పట్టివేత

మదనపల్లె : ఎక్సైజ్ సిబ్బంది, విజయవాడ ఎస్టీఎఫ్ బృందం జరిపిన తనిఖీల్లో నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ భీమలింగ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...మండలంలోని యలకపల్లెకుంట నుంచి నారమాకులపల్లె తాండాకు వెళ్లే మట్టిరోడ్డులో హంద్రీనీవా బ్రిడ్జి వద్ద ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారన్నారు. నారమాకులపల్లె తండాకు చెందిన బి.ఈశ్వర్‌నాయక్ కుమారుడు బి.బుద్దారెడ్డి బైక్‌లో 25 లీటర్ల సారా రవాణా చేస్తుండగా పట్టున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ డార్కస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి ఆవరణలో వ్యక్తిపై దాడి

మదనపల్లె : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో శనివారం సాయంత్రం ఓ వ్యక్తిపై కొందరు దాడిచేశారు. అమ్మినేనివీధి సిటీ హాస్పిటల్ వెనుకవైపు నివాసం ఉన్న ఇంద్ర(21) శనివారం సాయంత్రం జిల్లా ఆస్పత్రి ఆవరణలో మరో మహిళతో మాట్లాడుతుండగా, కొందరు వ్యక్తులు అకస్మాత్తుగా వచ్చి అతడిపై దాడి చేశారు. ఇంతలో అక్కడే ఉన్న కొందరు దాడిని అడ్డుకోవడంతో గాయపడిన ఇంద్రకు ఆస్పత్రిలో చికిత్స అందించారు. అనంతరం దాడి ఘటనపై ఫిర్యాదు చేసేందుకు బాధితుడు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు.

ఎంపీ మిథున్ కృషితో కేంద్రీయ విద్యాలయం

- మదనపల్లెను ఎడ్యుకేషన్‌హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే ఎంపీ ఆశయం
- రూ.50లక్షల ఎంపీ నిధులతో తాత్కాలిక భవనాల నిర్మాణం
- విద్యాలయం మంజూరుపై వైఎస్సార్‌సీపీ నాయకుల హర్షం



వలసపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కానున్న స్థలాన్ని సందర్శించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

మదనపల్లె : పేద పిల్లలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి మదనపల్లెకు కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయించారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏపీ ఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీమ్‌అస్లాం అన్నారు. మదనపల్లెకు కేంద్రీయ విద్యాలయం మంజూరు చేస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో...శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కేంద్రీయ విద్యాలయం మంజూరుకు కృషి చేసిన ఎంపీ మిథున్‌రెడ్డికి, పట్టణ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని వలసపల్లె పంచాయతీలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కానున్న స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లెను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న కృతనిశ్చయంతో ఎంపీ మిథున్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. అందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజంపేట పార్లమెంటరీ పరిధిలో ఏర్పాటు చేయాలనుకున్న మెడికల్ కాలేజీని మదనపల్లెకు కేటాయించేలా చూశారన్నారు. బీటీ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడమే కాకుండా, యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ తీసుకువచ్చారన్నారు. ప్రతిష్టాత్మకమైన కేంద్రీయ విద్యాలయాన్ని మదనపల్లెకు మంజూరు చేయించారన్నారు. అంతేకాకుండా వలసపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడమే కాకుండా, ఎంపీ నిధులు రూ.50లక్షలు మంజూరుచేసి, తాత్కాలిక భవన నిర్మాణ పనులను పూర్తి చేయించారన్నారు. ఎంపీ చొరవతోనే వచ్చే విద్యా సంవత్సరం నుంచి కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లు జరగనున్నాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, ఎక్కడ ఉన్నా ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ఎంపీ మిథున్‌రెడ్డి కృషి చేసి, కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయించడం అభినందనీయమన్నారు. మదనపల్లె చరిత్రలో కేంద్రీయ విద్యాలయం మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి మదనపల్లె నియోజకవర్గ ప్రజలకు కార్పొరేట్ వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఎంపీ మిథున్‌రెడ్డి, మెడికల్ కాలేజీని మంజూరు చేయించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కక్షగట్టి మెడికల్ కాలేజీని ప్రారంభించకుండా, ప్రైవేట్ పరం చేసేందుకు ప్రయత్నించడం బాధాకరమన్నారు. మెడికల్ కాలేజీ విషయంలో కూటమి ప్రభుత్వం రాజకీయాలు, పార్టీలను పక్కనపెట్టి, పేదప్రజలు, వైద్య విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. కేంద్రీయ విద్యాలయం మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీలో ఏర్పాటయ్యేలా కృషిచేసిన ఎంపీ మిథున్‌రెడ్డికి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజరెడ్డి, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు కరుణాకర్‌రెడ్డి, డి.హర్షవర్దన్‌రెడ్డి, నాయకులు వెలుగుచంద్ర, గుండ్లూరు రఫీ, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, ఎస్.ఏ.కరీముల్లా, కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్, పూజారి చరణ్, కొత్తపల్లె మహేష్, నూర్‌మొహియుద్దీన్‌ఖాన్, జన్నే సుబ్బానాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూ ముస్లింలు సోదరభావంతో మెలగాలి

రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, పక్కన ఎస్పీ, జేసీ

రాయచోటి : రాయచోటిలో హిందూ ముస్లింలు సోదరభావంతో మెలిగి ఎలాంటి గొడవలకు చోటు ఇవ్వరాదని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. రాయచోటి పట్టణంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న గొడవలను దృష్టిలో ఉంచుకొని హిందూ, ముస్లిం సోదరులతో వేర్వేరుగా పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో హిందూ ముస్లింలు ఒకరికొకరు సోదరభావంతో మెలగాలని, ఎలాంటి కండీషన్లు లేకుండా నిబంధనల ప్రకారం నడుచుకోవాలని మంత్రి సూచించారు. ప్రస్తుత సమాజ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రాబోయే రోజుల్లో ఎవరికీ ఎలాంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు జిల్లా అధికార యంత్రాంగం తరపున గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించి నాలుగు, ఐదు రోజుల తరువాత రెండు వర్గాల మత పెద్దలను పిలిపించి మరోసారి పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

గొడవలు జరిగితే కఠిన చర్యలు : ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి పట్టణంలో ఎలాంటి గొడవలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. పట్టణంలో కొంతమంది ఆకతాయిలు గొడవలు సృష్టిస్తున్నారని అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి 10.30 గంటల తరువాత అత్యవసర పరిస్థితులలో తప్ప అనవసరంగా ఎవరూ బయట తిరగకూడదన్నారు. రాయచోటి పట్టణం ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టామన్నారు. పట్టణంలో చిన్నపాటి సమస్య కూడా తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదన్ రావు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ పుల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట చెరువుకు నీటిని విడుదల చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట పెన్నానది నుంచి ఒంటిమిట్ట చెరువుకు నీరు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు టక్కోలి మనోహర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కట్టా యానాదయ్య కోరారు. ఒంటిమిట్టలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అప్పటి ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అభ్యర్థన మేరకు ప్రభుత్వం బందరుపల్లె-కుడమలూరు వద్ద ఉన్న పెన్నా నది నుంచి ఒంటిమిట్ట చెరువుకు పైప్‌లైన్ ద్వారా నీరు అందించేందుకు రూ. 40 కోట్లు మంజూరు చేసిందన్నారు. పైపులైను పనులు వేగవంతంగా జరిగినప్పటికీ పైపులైన్ నాసిరకంగా ఉండటంతో ఇప్పటి వరకు చెరువులోకి నీరు అందలేదన్నారు. పైపులైను కోసం చేసిన రూ. 40 కోట్లు ఖర్చు నీళ్లపాలైందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పాడైన పైపులైనుకు మరమ్మతులు నిర్వహించి ఒంటిమిట్ట చెరువుకు నీరు అందేలా చూడాలని వారు కోరారు. ఈ సమావేశంలో రైతులు ఎం. పెద్దమునిరెడ్డి, సి.మనోహర్ రెడ్డి, ఎస్.నాగేష్, కె.అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడిని హతమార్చిన గుర్తు తెలియని వ్యక్తులు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాస కాలనీ పదో నంబర్ వీధిలో జి.ఆంజనేయులు(57) అనే దివ్యాంగుడిని శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. పోలీసుల కథనం మేరకు.. దివ్యాంగుడైన ఆంజనేయులు ఇంటి వద్దే ఉండేవాడు. శుక్రవారం రాత్రి కూడా రోజులాగే ఇంటి బయట వరండాలో నిద్రపోయాడు. ఉదయం లేచి చూడగా ఆంజనేయులు హత్యకు గురైనట్లు గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆంజనేయులు తలపై బలంగా ఆయుధంతో కొట్టడంతో తల పగిలి మెదడు బయటకు వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య చాలా రోజుల క్రితమే మృతి చెందింది. రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు ఎస్‌ఐ మహేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ మూకల దాడి దారుణం

– వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప అర్బన్ : పెండ్లిమర్రి మండలం గోపరాజుపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నంద్యాల సుబ్బరాయుడుపై టీడీపీ మూకలు దాడి చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పి. నరేన్‌రామాంజుల రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 6వ తేదీన రాత్రి గోపరాజుపల్లిలో విగ్రహప్రతిష్ట కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని వస్తుండగా టీడీపీ అల్లరిమూకలు కత్తులతో దాడి చేశాయి. ఈ దాడిలో సుబ్బరాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతన్ని స్థానికులు 108లో రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుడిని రవీంద్రనాథరెడ్డి, నరేన్ రామాంజుల రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. బాధ్యులపై పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఏపీజీబీని తరలిస్తే ఊరుకునేది లేదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించే ఆలోచనను సత్వరమే ఉపసంహరించుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు విషయంపై శనివారం కడప నగరం మరియాపురంలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయం ఎదుట రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి తమ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందన్నారు. ఇక్కడి నుంచి ఏ సంస్థను తరలించినా ఊరుకుండేదిలేన్నారు. ఏపీజీబీని అమరావతికి తరలించడం లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్సీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధరామయ్య, ఆర్‌సీపీ నగర కార్యదర్శి మగ్బూల్ బాషా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన విశ్వనాథ్

వేముల : మండల కేంద్రమైన వేములకు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మిద్దె విశ్వనాథ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తొండూరు మండలం మడూరు గ్రామానికి చెందిన మిద్దె విశ్వనాథ్ వేముల మండలంలోని గొందిపల్లె గ్రామంలో బంధువుల ఇంటికి మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. వేముల సమీపానికి రాగానే ఆగి ఉన్న లారీని మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మిద్దె విశ్వనాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆటోలో తరలించారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : పట్టణ శివారులోని మల్లకతువ మలుపులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపవరం మండలం లెక్కవారిపల్లెకు చెందిన గాలి రఘురామయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కాశినాయన మండలంలో ఉన్న కూతురు వద్దకు బైకుపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మినీ లారీ అదుపు తప్పి రఘురామయ్యపై బోల్తా పడింది. లారీ కింద ఇరుక్కున్న బాధితుడిని అక్కడున్నవారు బయటకు తీశారు. తీవ్రంగా గాయపడటంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరసరావుపేట నుంచి అనంతపురానికి మెడికల్ సామగ్రి తీసుకెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. రోడ్డు మధ్యలో గుంతల్లో లారీ టైర్లు పడటంతో ఎగిరి బైకుపై పడినట్లు డ్రైవర్ సాయి తెలిపాడు. గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో ఉన్నాడని, అతని ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

ప్రమాదంలో దంపతులకు గాయాలు

ముద్దనూరు : ఆటో-కారు ఢీకొని శనివారం రాత్రి భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల సమాచారం మేరకు మండలంలోని కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, మునెమ్మలు ఆటోలో స్వగ్రామానికి వస్తున్నారు. నల్లబల్లె క్రాస్ సమీపంలోని ఓ వంక వద్ద ఎదురుగా ప్రయాణిస్తున్న కారు-ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భార్యాభర్తలిద్దరికీ తీవ్రగాయాలవడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో కారు ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో కారులోని వారికి ప్రమాదం తప్పింది.

బద్రిపల్లెలో ఇరువర్గాల ఘర్షణ

చాపాడు : మండల పరిధిలోని బద్రిపల్లె దళితవాడలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఏడు మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. బద్రిపల్లెకు చెందిన బండి రమేష్, మోకాట ఓబులేసు వర్గాల నడుమ ఆటో పెట్టుకునే విషయమై శుక్రవారం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఓబులేసు, ఓబన్న, వెరుగమ్మ, రమేష్, సూర్యం, శ్యామల, అనురాధ గాయపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆస్తి విషయమై మహిళపై దాడి

చాపాడు : మండలంలోని మొర్రాయిపల్లె గ్రామానికి చెందిన మహేశ్వరి అనే మహిళపై ఆస్తి విషయమై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. ఎస్‌ఐ చిన్నపెద్దయ్య కథనం మేరకు.. గ్రామానికి చెందిన మహేశ్వరి భర్త విజయ్ 2019లో మృతి చెందాడు. అప్పటి నుంచి మహేశ్వరికి చెందిన భూమి, ఇంటి స్థలం తమకు ఇవ్వాలని బావ దేవదాసు, మరిది ప్రవీణ్‌లు ఆమెపై వత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో శనివారం మహేశ్వరిపై ఇరువురు వ్యక్తులు దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాము కనిపిస్తే పట్టేస్తాడు!

పాములు పట్టడంలో దిట్ట.. రెడ్డి మోహన్



పాములు పడుతున్న పూజారివారిపల్లె రెడ్డి మోహన్

కురబలకోట : పాములంటే ఎవ్వరైనా భయపడతారు..అంతేకాదు హడలిపోతారు. వామ్మో అంటూ దూరంగా వెళతారు.. ఎక్కడ కాటేస్తుందోనని అటు వైపు వెళ్లడానికి కూడా జంకుతారు. అయితే కురబలకోట మండలం తెట్టు గ్రామం రిషివ్యాలీ స్కూల్ పక్కనున్న పూజారివారిపల్లెకు చెందిన పసుపులేటి రెడ్డి మోహన్ కు మాత్రం పాములంటే భయమే లేదు.. అదరడు..బెదరడు.. వాటిని అలవోకగా ఇట్టే పట్టేస్తాడు. పాములు పట్టడం అంత తేలికైన పని కాదు. చాకచక్యం ఉండాలి. కత్తి మీద సాములాంటిదే. టెక్నిక్ తెలిసి ఉండాలి. ఆపై అనుభవం అంతకు మించి నైపుణ్యం ఉండాలి. ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ప్రాణానికే ప్రమాదం. మొదటికే మోసం వస్తుంది. కానీ ఇతను వస్తే పుట్టలోని ఏ పామైనా బయటకు రావాల్సిందే అనే పేరు తెచ్చుకున్నారు. రెడ్డిమోహన్ పది వరకు చదివారు. గతంలో ముంబైలో టాక్సీ నడిపేవారు. స్వగ్రామం పూజారివారిపల్లెకి వచ్చి డ్రింకింగ్ వాటర్ ప్లాంటు నిర్వహిస్తున్నారు. అక్కడక్కడా పాములను చంపడం చూసిన ఇతను ఇది సరి కాదని ఆలోచించాడు. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం యూట్యూబ్‌లో చూసి పాములను ఎలా పట్టాలో సాధనతో నేర్చుకున్నాడు. ఇందుకు సంబంధించి స్నేక్ క్యాచర్ స్టిక్ కూడా తెచ్చుకున్నాడు. అంతేకాదు పరిసర ప్రాంతాల్లో తొలుత పాములను పట్టాడు. సంచి లేదా డబ్బాలో బంధించి తిరిగి వాటిని సమీప కొండల్లో, అడవుల్లో వదిలేసేవాడు. అనుభవం రావడంతో ధైర్యంగా పాములు పట్టేస్తున్నాడు. పరిసర ప్రాంతాల్లో పొలాల్లో, ఇళ్లల్లో ఎక్కడ పాము కన్పించినా ఇతనికి వెంటనే ఫోన్ చేస్తారు. మూడేళ్లుగా ఇది పరిపాటిగా మారింది. ఇతను కూడా ఫోన్ వచ్చిన వెంటనే తన కారులోనే ఆ ప్రాంతానికి వెళ్లి అలవోకగా పామును పట్టి సమీప అడవుల్లో వదిలేస్తారు. పాములు పగ బట్టవని వాటికి హాని చేయకుండా, చంపకుండా ఉండేందుకే తాను పాములు పట్టడం నేర్చుకున్నానని చెబుతారు. వాతావరణ మార్పుల వల్ల పాములు బయటకు వస్తుంటాయి. ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో పాములు కూడా భాగమేనంటారు. ఇంత వరకు ఎన్నో రకాల పాములు పట్టానని ఎప్పుడూ ప్రమాదానికి గురికాలేదన్నారు. కట్ల పాము, పెంజిరి పాము, నాగు పాము విషపూరితమైనవి.. ప్రమాదకరమన్నారు. మిగిలిన వాటితో ప్రమాదం లేదన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే పాములు రావన్నారు. సాధారణంగా ఎలుకల కోసం ఇవి వస్తుంటాయన్నారు. ఒక వేళ పాము కాటేసినా 45 నిమిషాలలోగా చికిత్స చేయించుకుంటే ప్రమాదం లేదన్నారు. ఇతను తన కుమారుడు సోము, అదే ఊరికి చెందిన నాగరాజుకు కూడా పాములు పట్టడంలో తర్ఫీదు ఇచ్చారు. వారు కూడా భయపడకుండా చాకచక్యంగా పాములు పట్టగలుగుతున్నారు. పాములు పట్టేవారు ఉండడంతో పరిసర ప్రాంతాల్లో పాములంటే భయపడేవారు తగ్గిపోయారు. ఎక్కడైనా పాము కనిపిస్తే 9440858045 మొబైల్ నెంబరుకు ఏ సమయంలో నైనా ఫోన్ చేయవచ్చని రెడ్డి మోహన్ తెలిపారు.

ఘనంగా వైఎస్ జార్జిరెడ్డి వర్ధంతి

దివ్యాంగులకు దుస్తులు పంపిణీ



దివంగత వైఎస్ జార్జిరెడ్డి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

పులివెందుల రూరల్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరుడు దివంగత వైఎస్ జార్జిరెడ్డి 25వ వర్ధంతిని పులివెందుల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, తనయుడు వైఎస్ సునీల్ కుమార్ రెడ్డి, జార్జిరెడ్డి సోదరుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి సతీమణి వైఎస్ సౌభాగ్యమ్మ, వైఎస్ సునీల్ కుమార్‌రెడ్డి సతీమణి కులశ్రీరెడ్డి, తనయుడు వైఎస్ సాహిల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు వైఎస్ శ్రేయారెడ్డి, వైఎస్ శరణ్‌రెడ్డి, వైఎస్ సజీవ్‌రెడ్డిలు శనివారం డిగ్రీ కళాశాల రోడ్డులోని వైఎస్ సమాధుల తోటలో వైఎస్ జార్జిరెడ్డి సమాధి వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు మృత్యుంజయ, ఆనందరావులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్ జార్జిరెడ్డి కుటుంబ సభ్యులు వైఎస్ రాజారెడ్డి, వైఎస్ జయమ్మల సమాధులకు కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే భాకరాపురంలోని వైఎస్ జార్జిరెడ్డి ఐటీఐలో జార్జిరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం దివ్యాంగులకు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు.వైఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, వైఎస్ జగన్ వ్యక్తిగత కార్యదర్శి రవిశేఖర్, ఎస్టేట్ మేనేజర్ వెంగమునిరెడ్డి, ఐటీఐ అధ్యాపకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగుల నిరసన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి ప్రైవేటీకరణను ఆపాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప విద్యుత్ భవన్ వద్ద విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చండీగఢ్‌లో విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను ప్రైవేటు వారికి అప్పగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తగదన్నారు. అత్యవసర సేవ అయిన విద్యుత్ రంగాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. విద్యుత్ సంస్థలో నష్టాలకు ఉద్యోగులు ఏమాత్రం కారణం కాదని, నష్టాలకు ప్రభుత్వమే కారణమని తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, జిల్లా కార్యదర్శి ఎంపీ చలపతి, డిస్కం నాయకులు ఎస్.శివశంకర్, బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.